

విద్యాభివృద్ధి కోసం నా వంతు కృషి చేస్తా 10లో..

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలి 10లో..

పెరిగిన రుణ ప్రణాళిక

జగిత్యాల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా వార్షిక రుణ ప్రణాళిక ఖరారైంది. ప్రతీ సంవత్సరం బ్యాంకుల ద్వారా రైతులు, ఇతర వర్గాల వారికి అందించేందుకుగాను నాబార్డు రుణ లక్ష్యాన్ని ఖరారు చేస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా వార్షిక ప్రణాళికను విడుల చేసిన అనంతరం జిల్లా వారీగా అందించాల్సిన రుణ లక్ష్యాన్ని నాబార్డు ప్రకటిస్తుంది. నాబార్డు ఇచ్చిన రుణ లక్ష్యాన్ని జిల్లాలోని వివిధ బ్యాంకులకు నిర్ధేశించి రుణాలను అందిస్తుంటారు. ఇందులో భాగంగా జిల్లాకు సంబంధించిన 2024-25 వార్షిక రుణ ప్రణాళికను ఇటీవల కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లా వ్యాప్తంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ. 7,347.80 కోట్ల రుణాలను ఇవ్వాలని నాబార్డు ప్రకటించింది. దీనికి సంబంధించి కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో బ్యాంకుల వారీగా నిర్దేశించారు.



2024-25కు గాను జిల్లా వార్షిక లక్ష్యం రూ. 7,347.80 కోట్లు

వ్యవసాయ, పశు సంవర్ధ, అనుబంధ రంగాలకు రూ. 3,302.22 కోట్లు

సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల రంగానికి రూ. 898.93 కోట్లు

భారీగా పెరిగిన రుణ లక్ష్యం...

జిల్లా వ్యాప్తంగా వివిధ రంగాలల్లో 2024-25 ఆర్థిక సంవత్సరానికిగానూ రూ. 7,347.80 కోట్ల రుణాలను అందించాలన్న లక్ష్యంతో అధికారులున్నారు. ఇందులో వివిధ విభాగాలకు అందించే లక్ష్యాన్ని నాబార్డు నిర్దేశించింది. వ్యవసాయ, వ్యవసాయ అనుబంద రంగాలైన ఫుడ్, అగ్రో ప్రాసెసింగ్, ఇతర వ్యవసాయ అనుబంధ రుణాల కోసం లక్ష్యాన్ని నిర్దేశించారు. గత యేడాది కంటే ప్రస్తుతం సుమారు రూ. 2,399 కోట్ల రుణ లక్ష్యాన్ని నాబార్డు నిర్ధేశించింది. ఈ రుణాల్లో కొత్త వాటితో పాటు రెన్యువల్ రుణాలు కూడా ఉంటాయి. ఈ రుణాల్లో కొత్త వాటితో పాటు రెన్యువల్ రుణాలు కూడా ఉంటాయి. జిల్లా వ్యాప్తంగా ప్రాధాన్యత రంగాలకు రూ. 5,345.30 కోట్లు, ప్రాధాన్యత లేని రంగాలకు రూ. 2,002.50 కోట్లు రుణాలను ఇవ్వాలని నిర్ణయించారు. ఇదిలా ఉండగా జిల్లాలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో 4,534.05 కోట్ల రుణాలను అందించాలన్న లక్ష్యం కాగా అందులో 3,225 కోట్ల రుణాలు అందించి 71.45 శాతం సాధించారు. గడిచిన 2023-24 ఆర్థిక సంవత్సరంలో 4,948 కోట్లు రుణాలు అందించాలన్న లక్ష్యం నిర్ణయించగా అందులో రూ. 3,820 కోట్లు రుణాలు అందించి 77.21 శాతం లక్ష్యాన్ని సాధించారు.



జిల్లా వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల రంగానికి..

జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరమా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ)రంగానికి ఈ యేడాది రూ. 1,144.15 కోట్లు రుణాలను ఇవ్వాలని నిర్ణయించారు. జిల్లాలో చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటును ప్రోత్స హించేందుకు ఈ రుణాలను అందిస్తారు. గత యేడాది కంటే అదనంగా ఎంఎస్ఎంఈ రుణాల కోసం సుమారు వంద కోట్లు పెంచారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ రుణాలతో పాటు స్వయం సహాయక సంఘాల సభ్యులకు గ్రామీణ జీవనోపాధి పథకం కింద అందించే రుణాలను ఈ విభాగంలోకి వస్తాయి. ఇందులో సూక్ష్మ తరహా పరిశ్రమలకు రూ. 416.98 కోట్లు, చిన్న తరహా పరిశ్రమలకు రూ. 405. 56 కోట్లు, మధ్య తరహా పరిశ్రమలకు రూ. 76.39 కోట్లు రుణాలు అందించాలని నిర్ణయించారు.

జిల్లా వ్యాప్తంగా లక్ష్యం...

జిల్లా వ్యాప్తంగా 2024.-25 ఆర్థిక సంవత్సరంలో 2,67,161 మంది ఖాతాదారులకు రుణాలను అందించాలన్న లక్ష్యాన్ని నాబార్డు నిర్ణయించింది. ఇందులో ప్రాధాన్యత రంగాలల్లో గల ఖాతాదారులు 2,03,272 మంది, ప్రాధాన్యత లేని రంగాలల్లో ఉన్న ఖాతాదారులు 63,889 మంది ఉన్నారు. వ్యవసాయ రంగ ఖాతాదారులు 1,79,382 మంది, సూక్ష్మ, మధ్య తరహా, చిన్న తరహా పరిశ్రమల రంగాలకు చెందిన ఖాతాదారులు 11,341 మంది, విద్య విభాగం 972 మంది, గృహ విభాగం 906 మంది, మౌలిక వసతుల రంగానికి చెందిన ఖాతాదారులు 124 మంది, ఇతరులు 10,547 మంది ఉన్నట్లు అధికారులు నిర్ణయించారు.

వ్యవసాయ అనుబంధ రంగాలకు..

2024-25 వార్షిక సంవత్సరానికి సంబంధించి వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ. 3,302 కోట్లు రుణాలను ఇవ్వాలని నాబార్డు నిర్ణయించింది. ఇందులో పంట రుణాల కోసం రూ. 2,292.61 కోట్లు, వ్యవ సాయ పెట్టుబడుల టర్మ్ రుణాలు రూ. 340.83 కోట్లు, వ్యవసాయటర్మ్ రుణాలు రూ. 394.82 కోట్లు ఇవ్వాలని నిర్ణయించారు. వ్యవసాయాభివృద్ధి, గోదాములు, కోల్డ్ స్టోరేజీ నిర్మాణం, విత్తనోత్పత్తి తదితర ప్లాంట్ల నిర్మాణాల కోసం ఈ యేడాది అధిక మొత్తంలో రుణాలను ఇవ్వాలని నిర్ణయించారు.

ఇతర ప్రాధాన్య రంగాలకు..

2024-25 వార్షిక సంవత్సరానికి గాను ఇతర ప్రాధాన్యత రంగాల కింద రుణాల కోసం రూ. 1,144.15 కోట్లు కేటాయించారు. ఇందులో విద్య, గృహ, పునరుద్ధరణీయ శక్తి, మౌలిక సదుపాయాల కింద రుణాలను అందిస్తారు. విద్యా సంబంధిత రుణాల కోసం రూ. 36.19 కోట్లు, గృహ నిర్మాణ, ఇతర అవసరాలకు రూ. 132.30 కోట్లు, మౌలిక సదుపాయాలకు 56.68 కోట్లు, పునరుద్ధరణీయ శక్తి కోసం రూ. 32.45 కోట్లు, ఇతర వాటికి రూ. 886.53 కోట్లు రుణాలను ఇవ్వాలని నాబార్డు నిర్ణయించింది.

పకడ్బందీగా రుణాల పంపిణీకి చర్యలు

షేక్ యాస్మిన్ బాషా, జిల్లా కలెక్టర్



జిల్లా వ్యాప్తంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ నిర్ధేశించిన వార్షిక రుణ ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాము. రుణాలను అందించడంలో బ్యాంకర్లు ఎటు వంటి నిర్లక్ష్యం చేయవద్దని ఆదేశించాము. ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ రుణ ప్రణాళికను లక్ష్యం మేరకు అమలు చేస్తాము.

బ్యాంకుల వారీగా లక్ష్యాన్ని నిర్దేశించాము

పొన్న వెంకట్ రెడ్డి, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్



జిల్లాలో బ్యాంకుల వారీగా రుణ లక్ష్యాన్ని నిర్దేశించాము. సంబంధిత బ్యాంకుల కేటాయించిన రుణ లక్ష్యాన్ని సాధించేలా అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నాము. ఇప్పటికే బ్యాంకర్లతో సమావేశం ఏర్పాటు చేసి దిశా నిర్దేశం చేశాము. నాబార్డు నిర్ణయించిన లక్ష్యం మేరకు బ్యాంకులు రుణాలు ఇవ్వాల్సి ఉంటుంది.

మిషన్ భగీరథ సర్వే పకడ్బందీగా చేయాలి

కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా



పెగడపల్లిలో మిషన్ భగీరథ సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్

పెగడపల్లి, జూన్ 12 : మిషన్ భగీరథ ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా పేర్కొన్నారు. బుదవారం మండల కేంద్రంలో మిషన్ భగీరథ ఇంటింటి సర్వేను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వే టీమ్‌లు ప్రతి ఇంటికి వెళ్లి మిషన్ భగీరథ కనెక్షన్ ఇచ్చిన ఇంటి యజమాని పేరు, కుటుంబ వివరాలు, ఆదారు నెంబరు, మిషన్ భగీరథ నీరు వస్తున్నాయా, ఎన్ని రోజుల కోమారు వస్తున్నాయి, తాగు నీటి సమస్యలు తదితర అంశాలను క్షుణ్ణంగా నమోదు చేయాలన్నారు. సర్వేను మండల అధికారులు పర్యవేక్షిస్తు ప్రతి ఇంటి వివరాలు నమోదు చేసేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా డీపీవో దేవరాజం, ఆర్డీవో మదుసూదన్, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఎంపీవో మహేందర్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ ఉన్నారు.

షెడ్యూల్ ప్రకారమే పదోన్నతులు నిర్వహించాలి

డీఈవోకు టీఎస్ యూటిఎఫ్ వినతి



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

జగిత్యాల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఏంతో కాలంగా ఎదురు చూస్తున్న ఉపాధ్యాయుల పదోన్నతులు షెడ్యూల్ ప్రకారం, పారదర్శకంగా నిర్వహించాలని డీఈవో జగన్ మోహన్ రెడ్డికి టీఎస్ యూటీఎఫ్ నేతలు వినతి పత్రం అందజేశారు. బుధవారం పట్టణంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈ వోను కలిసి సమస్యను విన్నవించారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు తిరుకోవెల శ్యామ్ సుందర్, ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఇటీవల కాలంలో పండిత్, పీఈటీ అప్డేడ్ కంటే ముందు ఉన్న ఖాళీలను సెకండరీ గ్రేడ్ టీచర్లతో పదోన్నతులు కల్పించాలన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన పోస్టులు సంబంధిత కసరత్తులు పూర్తి అయిన తర్వాత ఓపెన్ మెరిట్ ద్వారా వారికి పదోన్నతుల్లో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తిరుక్కొవెల శ్యామ్ సుందర్, అంబటి భూమేశ్వర్, ఉపాధ్యక్షులు డా. శ్రీనివాస్ పాల్గొన్నారు.

నరసింహుడి హుండీ లెక్కింపు



హుండీ లెక్కింపు పర్యవేక్షిస్తున్న ఈవో

ధర్మపురి, జూన్ 12: ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం హుండీ లెక్కింపు బుధవారం నిర్వహించగా రూ 48,67,803 ఆదాయం లభించింది. మార్చి 30 నుంచి జూన్ 12 వరకు గల 74 రోజులకు సంబంధించిన హుండీలు తెరచి లెక్కింపు నిర్వహించగా ఈ ఆదాయం లభించింది. అలాగే 120 గ్రాముల మిశ్రమ బంగారం, 6 కిలోల 450 గ్రాముల మిశ్రమ వెండి, 20 విదేశీ నోట్లు లభించాయి. ఈ కార్యక్రమంలో దేవాదాయ కరీంనగర్ సహాయ కమిషనర్ ఎ. చంద్రశేఖర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కు మార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిసెంట్ అలువాల శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్, ఆర్యవైశ్య నిత్యాన్న సత్రం కోశాధికారి జక్కు దేవేందర్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ వెంకట్‌రావు, సిబ్బంది, పోలీస్ సిబ్బంది, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఏఈవోలపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

జగిత్యాల అర్బన్, జూన్ 12: మహబూబాబాద్, ఆదిలాబాద్ జిల్లాలో అకారణంగా వేసిన సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని కోరుతూ జిల్లా ఏఈవో అధికారుల సంఘం సభ్యులు నల్లబ్యాడ్జిలతో నిరసన తెలిపారు. వారు మాట్లాడు తూ మండల వ్యవసాయ అధికారి మంజూరు చేయాల్సిన జనుము, జీలుగ విత్తనాలను సక్రమంగా మంజూరు చేయక ఎంఏవో లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్‌లను సొసైటీ ఏఆర్ఎస్‌కేలో పనిచేసే వారికి ఇవ్వడం వల్ల అక్రమాలు జరిగితే దానికి ఏఈవోలను బాధ్యులను చేయడం సరికాదన్నారు. ఆదిలాబాద్‌లో ఫర్టిలైజర్ షాపు నిర్వాహకుడు చేసిన తప్పిదానికి ఏఈవోను అన్యాయంగా సస్పెండ్ చేశారని ఆరోపించారు. అన్యాయంగా సస్పెన్షన్‌కు గురైన నలుగురు ఏఈవోలపై సస్పెన్షన్ ఎత్తివేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వెల్గటూర్, జూన్ 12: మండలంలోని కుమ్మరిపల్లి మాడల్ స్కూల్‌లో బోధించుటకు అర్హులైన వారి నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరవ తరగతి నుంచి ఇంటర్‌మీడియట్ వరకు బోధించడానికి సిద్ధంగా ఉన్న వారు ఈ నెల 18 లోగా మాడల్ స్కూల్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జీవశాస్త్రం బోధించుటకు బీఈడీ తో పాటు సంబంధిత సబ్జెక్టులో పీజీ పూర్తి చేసి ఉండాలని, ఇంగ్లీష్ బోధించుటకు బీఈడీతో పాటు సంబంధిత సబ్జెక్టులో ఎంఏ పూర్తి చేసిన వారు, హిందీ బోధించుటకు బీఈడీ లేదా హెచ్‌పీటీ చేసిన అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 18న డెమో నిర్వహిస్తామన్నారు. అర్హలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఆయిల్ పామ్ సాగుకు అండగా ఉంటాం

- ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
- జిల్లా కేంద్రంలో రైతులకు అవగాహన



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

జగిత్యాల అర్బన్, జూన్ 12: జిల్లాలో ఆయిల్ పామ్ సాగుచేసుకునే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ భరోసానిచ్చారు. జిల్లా కేంద్రంలోని స్థానిక వీకేబీ ఫంక్షన్ హాల్‌లో ఉద్యాన పట్టు పరిశ్రమ జిల్లా శాఖ, లోహియా ఎడిబుల్ ఆయిల్స్ ప్రై లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ధర్మపురి మండలంలోని అబ్బాపూర్ గ్రామంలో ఆయిల్‌పామ్ మొక్కలు పెంచేందుకు నర్సరీని ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ అబ్బాపూర్‌లో ఏర్పాటు చేసిన నర్సరీని గతంలో తాను సందర్శించానని, కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం తొలగించడంతో రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వపరంగా రైతులకు సాయం అందించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే ఎకరాకు 4200రూ. ఎన్నికల కోడ్‌కు ముందు నిధులు మంజూరు చేసిందని, ఎలక్షన్ కోడ్ నుంచి నేటి వరకు పెండింగ్‌లో ఉన్న డబ్బులను ఇప్పించాలని జీవన్‌రెడ్డి ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ పామ్ అయిల్‌కు మద్దతు ధర ప్రధానం అని, మద్దతు ధరలేకపోతే రైతుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. పామ్ ఆయిల్ పంటలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించినట్లయితే రైతులకు ధీమా పెరుగుతుందన్నారు. వాణిజ్య పంటలతో లాభాలు పొందాలనుకోవడం సహజమేనని, కానీ అందులో ఉన్న లోటుపాట్లను సరిదిద్దాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కలెక్టర్ యాస్మిన్ భాషా మాట్లాడుతూ లోహియా కంపెనీ ఆయిల్ పామ్‌పై విదేశీ శాస్త్రవేత్తలతో రైతులకు అవగాహన కల్పించేందుకు జగిత్యాలను ఎంపిక చేసుకోవడం శుభపరిణామమన్నారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు అపోహలు లేకుండ ఉండేందుకు 1993 ఆయిల్ పామ్ చట్టం ప్రకారం రక్షణ ఉంటుందన్నారు. మొక్కలు నాటిన నాలుగేళ్లపాటు ఎకరానికి రూ. 4200 చొప్పున మెయింటెన్స్ కింద చెల్లిస్తున్నామన్నారు.

కంపెనీ కొనుగోలు చేయని పక్షంలో ఉత్పత్తి ఎక్కువైతే ప్రభుత్వం ధర చెల్లించి కొనుగోలు చేస్తుందన్నారు. ఈ యేడాది 5వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు జిల్లాలో టార్గెట్ పెట్టుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మెన్ శ్రీకాంత్ రెడ్డి, జడ్పీటీసీ బాదినేని రాజేందర్, రూరల్ ఎంపీపీ మహేష్, జిల్లా హార్టీకల్చర్ అధికారి ప్రతాప్‌సింగ్, డీఏవో కల్పన, శ్యామ్, స్పందనతో పాటు అధికారులు, సిబ్బంది, లోహియా సంస్థ బృందం, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. లోహియా కంపెనీ ప్రతినిధులుగా ఇక్కడికి వచ్చామని ఫ్రాన్స్ ఆయిల్‌పామ్ శాస్త్రవేత్త, నికోలస్ అన్నారు. లోహియా సంస్థ 1990 నుంచి విత్తనాలను అందిస్తుంది. డిమాండ్‌కు తగ్గట్టుగా ముందుకు వెళ్తే ఖచ్చితంగా అనుకున్న లాభాలు సాధించవచ్చారు.

ప్రభుత్వ పాఠశాలల పనితీరుపై నమ్మకం కలిగించాలి

బడిబాటలో అతిథుల మనోగతం

జగిత్యాల అర్బన్, జూన్ 12: ప్రభుత్వ పాఠశాలల పనితీరుపై ప్రజల్లో అపోహ నెలకొందని, దాన్ని పోగొట్టి నమ్మకం కలిగించినప్పుడే ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు విశ్వాసం పెరుగుతుందని అతిథులు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. జూన్ 12 బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాలల పున:ప్రారంభమైన సంద ర్భంగా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కలెక్టర్ యాస్మిన్ భాషా, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌లు హాజర య్యారు. ఈ సందర్భంగా వసంత మాట్లాడుతూ మహిళా సంఘాల ద్వారా దుస్తులను కుట్టించి సకాలంలో అందించిన మహిళా సంఘాల సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నిరుపేద విద్యా ర్థుల చదువులకు ఎలాంటి ఆటంకం లేకుండా ప్రభుత్వం తరుపున ఉచిత విద్యతో పాటు, పుస్తకాలు, నోట్‌బుక్‌లు ఉచితంగా పంపిణీ చేయడం శుభపరిణామం అన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ విద్య ప్రాధాన్యతను గురించి మనకు తెలియంది కాదని, విద్యా, వైద్యం ప్రాధాన్యతను గుర్తించి రాజ్యాంగంలో ప్రాథమిక హక్కుగా పొందుపర్చారని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తుందని, 11వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు నియామకాలు జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న భవనాలను సైతం నిర్మాణం పూర్తి చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో అడ్మిషన్‌లో ప్రైవేట్ పాఠశాలలు సహకరించడం లేదన్నారు. కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపి, విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి, బెస్ట్ అవైలబుల్ లో జిల్లా కేంద్రంలోని స్కూళ్లకు అవకాశం ఉండేలా చూడాలన్నారు. కలెక్టర్ యాస్మిన్ భాషా మాట్లాడుతూ నేటి కార్యక్రమం చూస్తే తన చిన్నతనంలోని పాఠశాలల రోజులు గుర్తుకు వచ్చాయన్నారు. తొలి సారి జిల్లాలో యూనిఫాంలు, పుస్తకాలు పాఠశాలల పున: ప్రారంభం రోజే పుస్తకాలు, నోట్ బుక్‌లు, యూనిఫాంలు అందించడం తన అనుభవంలో ఇదే ప్రథమం అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ కరోనా కారణంగా రెండు విద్యా సంవత్సరాలు నష్టపోయే పరిస్థితి ఏర్పాడిందని, రెండేళ్ల తర్వాత సీఎం కేసీఆర్ విద్యా, వైద్యంపై ప్రత్యేక దృష్టిసారించారన్నారు. యూడైస్ ప్రామాణికంగా మన ఊరు- మన బడి కార్యక్రమంకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మెన్ హరిచరణ్‌రావు, బల్దియా వైస్ చైర్మెన్ గోలి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పొలాస రాజు, డీపీవో దేవరాజం, ఎంఈవోగా యత్రితో పాటు జిల్లా అధికారులు, విద్యాశాఖ అధికారులు, మహిళా సంఘాల నిర్వాహకులు పాల్గొన్నారు.



పుస్తకాలు, యూనిఫాంలు, నోట్‌బుక్‌లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

అధికారుల తీరుపై జీవన్‌రెడ్డి అసహనం

జిల్లా కేంద్రంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమం నిర్వహణ తీరుపై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. పాఠశాలల ప్రారంభం రోజున రాష్ట్రగీతమైన జయ జయహే తెలంగాణ పాటను ఎందుకు ప్లే చేయలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

డీఈవో లేకుంటే మిగతా అధికారులకు బాధ్యత లేదా అంటూ అసహనం వ్యక్తం చేశారు. జీవన్‌రెడ్డి అసహనంతో స్పందించిన అధికారులు హుటాహుటిన కార్యక్రమం మధ్యలో రాష్ట్ర గీతంను ప్లే చేశారు.

బీసీల ఐక్యతతోనే అన్ని రంగాల్లో రాణింపు



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత

రాయికల్, జూన్ 12: బీసీలు సంఘటితంతోనే అన్ని రంగాల్లో రాణించగలరని జగిత్యాల జిల్లా జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు బోగ శ్రావణిలు అన్నారు. రాయికల్ మండలంలోని ఇటిక్యాల గ్రామంలో బీసీ కులాల సమ్మేళనం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు బోగ శ్రావణిలు మాట్లాడుతూ బీసీలు రాజ్యాధికారం దిశగా పయనించాలంటే ఐకమత్యంతో ఉండాలని, అన్ని రంగాల్లో రాణించాలంటే బీసీలు అక్షరాస్యతతో ముందుండాలన్నారు. బీసీలు అగ్రవర్ణాలకు పట్టం కట్టడం కాదని, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అనుకున్న లక్ష్యాలను సాధించాలని పేర్కొ న్నారు. మండలంలోనే మొదటిసారిగా బీసీల ఐక్య ఉద్యమాన్ని ప్రారంభించిన ఇటిక్యాల బీసీ సమైక్యత ఉద్యమాన్ని ఉధృతం చేయాలని వారు పిలుపునిచ్చా రు. అనంతరం బీసీ సంఘం నాయకుడు, యాదవ సంఘం మండల అధ్యక్షుడు వాసరి రవి యాదవ్ మాట్లాడుతూ బీసీలు అన్ని రంగాల్లో రాణించకపోవ డానికి అనైక్యత, అభద్రతా భావం, అక్షరాస్యత లేకపోవడం కారణాలని అన్నారు. అనంతరం బీసీలంతా ఐకమత్యంతో ఉండి అనుకున్న లక్ష్యాలను సాధించే దిశగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఇటిక్యాల మాజీ సర్పంచ్ లావణ్యవేణు, బీసీ ఐక్యత సంఘం అధ్యక్షుడు రొట్టె శ్రీధర్, ఉపాధ్యక్షులు భూషణవేణి శ్రీనివాస్ యాదవ్, సింగని నవీన్, ప్రధాన కార్యదర్శి కనపర్తి శ్రీనివాస్, కోశాధికారి అంజయ్య, వీఎస్ఎస్ చైర్మన్ రాజేందర్ యాదవ్, ఐక్యత సంఘం సీనియర్ నాయకులు నారాయణ గౌడ్, సాయ గౌడ్, రాజేందర్ గౌడ్, కోల శ్రీనివాస్, ఎస్ఆర్‌బి రవి, చంద్రశేఖర్, రాయికల్ మండల ముదిరాజ్ సంఘం ప్రధాన కార్యదర్శి అన్నవేణి వేణు పాల్గొన్నారు.

నిజామాబాద్-వరంగల్ మార్గంలో డీలక్స్ బస్సు సర్వీసు

భగత్‌నగర్, జూన్ 12: నిజామాబాద్-వరంగల్ మార్గంలో కొత్తగా డీలక్స్ బస్సు సౌకర్యం కల్పించినట్లు కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎస్ సుచరిత ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్-వరగంల్ మార్గంలో పెరిగిన రద్దీకి అనుగుణంగా కొత్తగా కల్పించిన డీలక్స్ బస్సు సౌకర్యాన్ని ప్రయాణికులు వినియో గించుకోవాలని కోరారు. వరంగల్ వైపు నిజామాబాద్ నుంచి 6.00, 6.45, 7.30, 8.00, 9.00, 13.00, 13.45, 14.30, 15.00, 15.30, 16.00 గంటలకు, మెట్‌పల్లి నుంచి 7.30, 8.15, 9.00, 9.30, 10.00, 10.30, 14.30, 15.15, 16.00, 16.30, 17.00, 17..30 గంటలకు బయలుదేతుతోందన్నారు. కోరుట్ల నుంచి 7.45, 8.30, 9.15, 9.45, 10.15, 10.45, 14.45, 15.30, 16.15, 16.45, 17.15, 17.45 గంటలకు జగిత్యాల నుంచి 10.00, 10.45, 11.30, 12.00, 12.30, 13.00, 17.00, 17.45, 18.30, 19.00, 19.30, 20.00 గంటలకు, అదే విధంగా వరంగల్ నుంచి నిజామాబాద్‌కు 6.00, 6.45, 7.30, 8.00, 8.30, 9.00, 13.00, 13.45, 14.30, 15.00, 15.30, 16.00 గంటలకు డీలక్స్ బస్సులు బయలుదేరుతాయన్నారు. ఈ సర్వీసులు 13వ తేదీ గురువారం నుంచి ప్రారంభిస్తున్నామని, ప్రయాణికులు అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.


కాంట్రాక్టరుపై కత్తితో దాడి

జ్యోతినగర్, జూన్ 12: ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌతమి నగర్‌లో బుధవారం మేకల మల్లేష్ అనే కాంట్రాక్టరుపై పాత నేరస్తుడు మేకల కుమార స్వామి కత్తితో దాడి చేశాడు. దాడికి పాల్పడిన కుమార స్వామి గతంలో జరిగిన కాంట్రాక్టరు మల్లేశ్ తమ్ముడు మేకల లింగయ్య హత్య కేసు లో ప్రధాన నిందితుడు. బాధితుడు మేకల మల్లేశ్ కథనం ప్రకారం వివరా లిలా ఉన్నాయి. కాంట్రాక్టరు మల్లేశ్ గోదావరిఖని నుంచి వస్తున్న క్రమంలో గౌతమి నగర్ వద్ద మేకల కుమారస్వామి తారసపడి మల్లేశ్ వాహనాన్ని ఆపి వాదనకు దిగాడని తెలిపాడు. తన ఇంటి వద్ద రెండుసార్లు ఎందుకు తిరిగా వంటూ మల్లేశ్ అడగడంతో కుమారస్వామి తన దగ్గర ఉన్న కత్తితో మల్లేశ్‌పై దాడి చేశాడన్నాడు. దీంతో తన జీపులో ఉన్న రాడ్డు తీసి బెదిరించడంతో పారిపోయాడన్నాడు. దీంతో మల్లేశ్ స్వల్పంగా గాయపడ్డాడు. ఈ మేరకు ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ చేపట్టారు.

యువకుడి ఆత్మహత్య

సుల్తానాబాద్, జూన్ 12: సుల్తానాబాద్ పట్టణంలోని పూసాల రోడ్డుకు చెం దిన రమేష్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మద్యానికి బానిసై తరచూ తాగి వచ్చి భార్యతో గొడవపడే. మంగళవారం రాత్రి కూడా భార్యభర్తల మధ్య గొడ వ జరిగింది. ఈ నేపథ్యంలో భార్య పక్కనే ఉన్న వారి మరో ఇంటిలో పడుకుం ది. బుధవారం తెల్లవారుజామున లేచి తన ఇంటికి రాగా భర్త రమేష్ (35) ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుని ఉన్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రావణ్ తెలిపారు.





ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ఆలస్యం?

నీట్-2024పై రగడే కారణం!.. తెలంగాణలో 56 కాలేజీల్లో 8,515 ఎంబీబీఎస్ సీట్లు

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వైద్య విద్యకు సంబంధించి ఎంబీబీఎస్ ప్రవేశాల ప్రక్రియ ఈ ఏడాది ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. నీట్-2024పై దేశ వ్యాప్తంగా జరుగుతున్న రగడే ఇందుకు కారణం. నీట్ మార్కులపై ఇప్పటికే సుప్రీం కోర్టులో కేసు నడుస్తోంది. నీట్-2024ను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలన్న పిల్‌ను కోర్టు తోసిపుచ్చింది. కానీ, నీట్ విషయంలో మరిన్ని కేసులు పడే అవకాశం ఉందని, విషయం అంత త్వరగా తేలేట్లుగా కనిపించడం లేదని జాతీయ వైద్య విద్య కమిషన్(ఎన్ఎంసీ) అధికారులు రాష్ట్ర వైద్య విద్య ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. మరోపక్క, దేశ వ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీలు, వాటిలోని సీట్ల వివరాలను ఎన్ఎంసీ తన వెబ్‌సైట్‌లో పెట్టింది. విద్యార్థులు ఆయా కళాశాలల్లోనే చేరాలనే పేర్కొంది. ఎన్ఎంసీ వెబ్‌సైట్ ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు కలిపి తెలంగాణలో 56 వైద్య కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో మొత్తం 8,515 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి.

కొత్త కాలేజీల సంగతేంటో?

రాష్ట్రం ప్రభుత్వం దరఖాస్తు చేసిన కొత్త వైద్య కళాశాలల అనుమతిపై ఎన్ఎంసీ ఏటూ తేల్చడం లేదు. అనుమతి ఇస్తారో ? ఇవ్వరో కూడా స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో కొత్త కళాశాలల్లో ఈ ఏడాది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడం అనుమానంగానే ఉంది. గద్వాల, వరంగల్(నర్సంపేట్), యాదాద్రి, మేడ్చల్ (కుత్బుల్లాపూర్), నారాయణపేట్, ములుగు, మెదక్, రంగారెడ్డి(మహేశ్వరం) జిల్లాల్లో వైద్య కళాశాలల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఆగస్టు- సెప్టెంబరులో ఎన్ఎంసీకి దరఖాస్తు చేసింది. ఆయా కళాశాలలను వర్చువల్‌గా, స్వయంగా తనిఖీ చేసిన ఎన్ఎంసీ బృందాలు పలు లోపాలను ఎత్తి చూపి వాటిని సరిచేసుకోవాలని సూచించాయి. ఆ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ లోపాలను సవరించింది. అయితే వైద్య కళాశాలలకు లెటర్ ఆఫ్ పర్మిషన్(ఎల్ఓపీ) ఇచ్చేముందు ఎన్ఎంసీ బృందాలు మరోమారు తనిఖీ చేస్తాయి. మరికొద్ది రోజుల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం కానుండగా, ఎన్ఎంసీ బృందాలు ఇప్పటిదాకా మళ్లీ తనిఖీలకు రాలేదు. నిజానికి, తాము ఎత్తిచూపిన లోపాలను సరి చేసుకున్నట్టు చూపించిన తర్వాత వాటికి సంతృప్తి చెందితేనే ఎన్ఎంసీ అనుమతి ఇస్తుంది. ఒకవేళ అనుమతి ఇవ్వకపోతే ప్రభుత్వం అప్పీలు చేసుకునే వీలుంటుంది. ప్రభుత్వ కళాశాల కాబట్టి సర్కారే గ్యారంటీగా ఉండి లోపాలను సవరించుకుంటామని లిఖితపూర్వక హామీనిస్తుంది. దాంతో ఎన్ఎంసీ అనుమతి మంజూరు చేస్తుంది. ఈ వ్యవహారానికి 20-30 రోజుల సమయం పడుతుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇది సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. దీంతో త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరుతూ వైద్యవిద్య సంచాలకులు ఎన్ఎంసీకు విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఎన్ఎంసీ ఎలా స్పందిస్తుందో చూడాల్సి ఉంది. మరోపక్క, అనుమతుల విషయమై కొన్ని వైద్య కళాశాలల యాజమాన్యాలు ఇప్పటికే కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రిని కలిసి చర్చినట్టు సమాచారం.

గ్రూప్-1 మెయిన్స్ 7 రోజులు

(మొదటిపేజీ తరువాయి)

మీడియంలోనే రాయాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న సమయంలోనే ఏ మీడియంలో రాసేదీ తెలపాల్సి ఉంటుంది. ఒక పరీక్ష తెలుగులో, మరో పేపర్‌ను ఇంగ్లి‌ష్‌లో రాయడానికి వీల్లేదు. అలా వేర్వేరు మాధ్యమాల్లో రాసినవారి పేపర్లను పరిగణనలోకి తీసుకోరు. రాష్ట్రంలో సుమారు 563 గ్రూపు-1 పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఈ నెల 9వ తేదీన నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలను త్వరలోనే ప్రకటించనున్నారు. అందులో ఉత్తీర్ణులైనవారిని.. ఒక్కో పోస్టుకు 50 మంది అభ్యర్థుల చొప్పున మెయిన్ పరీక్షకు ఎంపిక చేయనున్నారు. మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచే అభ్యర్థులను పోస్టులకు ఎంపిక చేస్తారు. ఈ నియామకాల్లో ఏలాంటి ఇంటర్వ్యూలూ ఉండవు. మెయిన్ పరీక్షలకు సంబంధించిన వివరాలను కమిషన్ అధికారులు బుధవారం వెల్లడించారు. ఆ వివరాల ప్రకారం..

ఇదీ షెడ్యూలు

తేదీ	పేపర్
అక్టోబరు 21	జనరల్ ఇంగ్లిష్
అక్టోబరు 22	జనరల్ ఎస్సే (పేపర్-1)
అక్టోబరు 23	చరిత్ర, కల్చర్ అండ్ జాగ్రఫీ (పేపర్-2)
అక్టోబరు 24	ఇండియన్ సొసైటీ, రాజ్యాంగం-గవర్నెన్స్ (పేపర్-3)
అక్టోబరు 25	ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ (పేపర్-4)
అక్టోబరు 26	సైన్స్ అండ్ టెక్నాలజీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ (పేపర్-5)
అక్టోబరు 27	తెలంగాణ మూమెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్ (పేపర్-6)

- పరీక్షల తొలిరోజు అయిన అక్టోబరు 21న క్వాలిఫైయింగ్ టెస్ట్ (జనరల్ ఇంగ్లిష్ పరీక్ష) నిర్వహించనున్నారు. అనంతరం ఇతర పేపర్ల పరీక్షలను నిర్వహిస్తారు. క్వాలిఫైయింగ్ టెస్ట్ కాకుండా మెయిన్స్‌లో మొత్తం 6 పేపర్లకు పరీక్షలను నిర్వహిస్తున్నారు.
- పరీక్షలన్నీ హైదరాబాద్, దాని చుట్టు పక్కల హెచ్ఎండీఏ పరిధిలోనే జరుగుతాయి.
- ప్రతిపేపర్‌లోనూ 150 మార్కులకు ప్రశ్నలుంటాయి.
- అభ్యర్థులు అన్ని పేపర్లూ రాయాల్సి ఉంటుంది. ఏ ఒక్క పరీక్షకు గైర్హాజరైనా ఆ అభ్యర్థులు రాసిన ఇతర పేపర్లను పరిగణనలోకి తీసుకోరు.
- క్వాలిఫయింగ్ పరీక్షను 10వ తరగతి ప్రమాణాలతో నిర్వహిస్తారు. ఇతర పేపర్ల పరీక్షలకు సంబంధించిన సిలబస్‌ను ఇప్పటికే ప్రకటించారు.

గ్రూప్-1 ప్రిలిమినరీ కీ విడుదల

ఈ నెల 9వ తేదీన నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష కీని విడుదల చేశారు. గురువారం (13వ తేదీ) నుంచి 17వ తేదీ మధ్య ఈ కీ కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది. కీపై అభ్యంతరాలుంటే.. 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తెలపాల్సిందిగా అభ్యర్థులకు అధికారులు సూచించారు.

ఔటర్.. బంగారు బాతే!

వాహనాల రద్దీతో నెల నెలా పెరుగుతున్న ఆదాయం

- ఏప్రిల్‌లో రూ.60 కోట్లు..
- మే నెలలో 62.7 కోట్ల రాబడి



హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు.. ఆదాయ పరంగా బంగారు బాతు అన్నది స్పష్టమవుతోంది. ఔటర్‌పై రోజు రోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీతో ఆదాయం భారీగా పెరుగుతోంది. ప్రతి నెలా హెచ్ఎండీఏ అధికారులు ఊహించని స్థాయిలో రాబడి వస్తోంది. ఔటర్ రింగ్ రోడ్డును లీజుకు ఇచ్చే సందర్భంలో ఓ ప్రైవేటు ఏజెన్సీ మదింపు చేసిన ఆదాయ అంచనాలన్నీ తలకిందులవుతున్నాయి. అప్పుడు.. ఏడాదికి 2శాతం నుంచి 3శాతం వరకు ఆదాయం పెరుగుతుందని అంచనాలు వేయగా, ప్రస్తుతం ఒక్కో నెలకే 4శాతానికి పైగా పెరుగుతోంది. టోల్ చార్జీలు పెంచక ముందే ఆదాయం ఈ స్థాయిలో పెరుగుతుండడంతో.. చార్జీల పెంపుతో మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ఔటర్ ఆదాయంపై అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనాలు అక్షరసత్యాలు అని నిరూపితమవుతున్నాయి. గతేడాది ఔటర్ రింగ్ రోడ్డును హెచ్ఎండీఏ గత ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓ ప్రైవేటు సంస్థకు కట్టబెట్టిన విషయం తెలిసిందే. దీంతో ఏటేటా భారీ ఆదాయాన్ని సమకూర్చే ఔటర్‌ను చాలా తక్కువ బిడ్‌కు 30 ఏళ్లకు లీజుకివ్వడాన్ని ప్రస్తావిస్తూ.. 'రాసిచ్చేశారు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం ప్రచురించింది. దీంతోపాటు ఔటర్‌పై ఏటా పెరిగే ఆదాయ, వ్యయాలను అంచనా వేసి చూపిస్తూ.. రాష్ట్రానికి బంగారు బాతు లాంటి ఔటర్‌ను ప్రైవేటుపరం చేయడాన్ని పేర్కొంటూ 'బంగారు బాతు.. బలి' అనే శీర్షికతో కథనం ప్రచురించింది. ఈ కథనాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారడంతోపాటు అప్పటి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాయి. విపక్షాలకు అస్త్రంగా మారాయి. ఆ కథనాలన్నీ ఇప్పుడు అక్షరసత్యాలుగా నిరూపితమవుతున్నాయి.

టోల్ చార్జీల పెంపుతో సంబంధం లేకుండానే

ఔటర్‌ను ప్రైవేటు సంస్థకు అప్పగించిన సందర్భంలో ఆదాయాన్ని మదింపు చేసిన ఏజెన్సీ. ఏటా 2శాతం నుంచి 3శాతానికి అటు, ఇటుగా రాబడి పెరుగుతుందని అంచనాలు వేసింది. ముఖ్యంగా హోల్‌సేల్ ప్రైస్ ఇండెక్స్ (డబ్ల్యూపీఐ) ప్రకారం ఏటా టోల్ చార్జీల్లో చోటుచేసుకునే 4శాతం నుంచి 5శాతం పెంపుదల మేరకే ఆదాయం పెరుగుతుందని ఆ ఏజెన్సీ తేల్చింది. సాధారణంగా ఏప్రిల్ నుంచి కొత్తగా అందుబాటులోకి వచ్చే టోల్ చార్జీలతో ఆ ఆర్థిక సంవత్సరానికి ఆదాయం పెరుగుతుందని హెచ్ఎండీఏ అధికారులు కూడా అంచనాలు వేశారు. కానీ, ప్రస్తుతం టోల్ చార్జీలు పెంచకుండానే ప్రతి నెలా ఆదాయం పెరుగుతోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.60.2 కోట్ల ఆదాయం రాగా, మే నెలలో రూ.62.7 కోట్లు వచ్చింది. అంటే దాదాపు రూ.2.5 కోట్లు పెరిగింది. ఒక్క నెలకే 4.2 శాతం పెరుగుదల నమోదైంది. ఈ పెరుగుదల గతేడాది నుంచి కొనసాగుతోంది. ఔటర్‌పై రోజు రోజుకూ వాహనాల రద్దీ పెరుగుతుండడంతో ఆ మేరకు ఆదాయం పెరుగుతోంది. కాగా, డబ్ల్యూపీఐ ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఔటర్ రింగ్ రోడ్డుపై టోల్ చార్జీలు ఏప్రిల్ 1 నుంచే పెరగాలి. కానీ, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వీటిని పెంచకుండా నిలిపివేశారు. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ ముగియడంతో టోల్ చార్జీలు పెంచుకోవడానికి అవకాశం కల్పించారు. దాంతో ఈ చార్జీలు 4శాతం నుంచి 5శాతం మేర పెరిగాయి. ఇందుకు అనుగుణంగా ఆదాయం పెరుగుతుందని, వాహనాల రద్దీ ద్వారా వచ్చే ఆదాయం అదనంగా ఉంటుందని హెచ్ఎండీఏ- హెచ్‌జీసీఎల్‌కు చెందిన ఓ అధికారి తెలిపారు.

నేడు లాసెట్ ఫలితాల విడుదల

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): లాసెట్ ఫలితాలను ఈ నెల 13వ తేదీన విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. గురువారం సాయంత్రం 3.30 గంటలకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి ఈ ఫలితాలను ప్రకటించనున్నారు.

నేటి నుంచి రెండోదశ దోస్త్

డిగ్రీలో ప్రవేశాలకు సంబంధించి 13వ తేదీ నుంచి రెండో దశ దోస్త్ కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలు కానుంది. మొదటి దశలో సీట్లు పొందిన అభ్యర్థులు ఆయా కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు 15వ తేదీలో ముగియనుంది. 14,15వ తేదీల్లో అభ్యర్థులు తమ వెబ్‌ఆప్షన్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కథలాపూర్, జూన్ 12: పొలం వద్ద ఓ వ్యక్తికి దారి ఇవ్వనం దుకు తనకు జరిమానా విధించారని మనస్థాపం చెందిన దుంపెట కు చెం దిన అరిగెల రాజేశం (35) అనే రైతు బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఎస్సై నవీన్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... అరిగెల రాజేశం పొలం వద్ద కొంత కాలంగా దారి గురించి వివాదం కొనసాగుతోంది. రాజేశం భూమి నుంచి దారి ఇవ్వాలని పక్కనే ఉన్న రైతు కోరగా రాజేశం నిరాకరించాడు. దీంతో పంచాయతీ పెట్టి రాజేశంకు జరి మానా విధించడం వల్ల తీవ్ర మనస్థాపం చెంది ఆత్మహత్యాయత్నం చేశా డు. వెంటనే కథలాపూర్ ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తరలించారని చెప్పారు. ప్రాథమికంగా వచ్చిన సమాచారం మేరకు బాధితుని నుంచి వివరాలు సేకరించామని ఎస్సై తెలిపారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

కొడిమ్యాల, జూన్ 12 : మండలంలోని చెప్యాల గ్రామ శివారులో బుధవారం మధ్యాహ్నం ప్రభుత్వం నుంచి అనుమతి లేకుండా అక్రమంగా నల్ల మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్‌తో పాటు జేసీబీని పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై ఎస్. సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు అనుమతి లేకుండా జేసీబీతో ట్రాక్టర్‌లో మట్టిని తరలిస్తుండగా వాటిని సీజ్ చేసినట్లు తెలిపారు. సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఇసుక, నల్ల మట్టిని అనుమతి లేకుండా తరలిస్తే వాహనాలను సీజ్ చేసి, కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు ఊరట

జీఓ నెం.970 తప్పిదాలపై ముఖ్యమంత్రి రేవంత్ సీరియస్

సరిచేసిన ప్రభుత్వం... జీఓ నెం.1037 జారీ

పాత జీఓల ప్రకారమే నాన్ పీహెచ్ వర్కర్లకు వేతనాలు

కోల్‌సిటీ, జూన్ 12: మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వం ఊరటనిచ్చింది. మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లలో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగుల వేతనాలకు సంబంధించి జీఓ నం.970లో జరిగిన పొరపాట్లను సవరించింది. ఈ మేరకు ప్రభుత్వం బుధవారం జీఓ నం. 1037జారీ చేసింది. జీవో నం.970లో నాన్ పీహెచ్ వర్కర్లకు సంబంధించి అనెక్స్-2లో పేర్కొన్న వివరాలపై స్పష్టతనిచ్చింది. గతంలో జారీచేసిన జీవో 14,60,63 ప్రకారమే వేతనాలు చెల్లిస్తారని, ఆ జీవోలనే పరిగణనలోకి తీసుకోవాలంటూ పేర్కొన్నది. ఈ మేరకు ఫైనాన్స్ విభాగం జాయింట్ సెక్రటరీకే హరిత ఆదేశాలు జారీచేశారు.

రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లలో పనిచేస్తున్న 30955మంది అవుట్ సోర్సింగ్ కార్మికుల వేత నాలకు సంబంధించి ప్రభుత్వం గత నెల 5న జీవో నం.970 జారీ చేసింది. ఈ జీఓను అనుసరించి పీహెచ్ వర్కర్లకు, నాన్ పీహెచ్ వర్కర్లకు కేవలం రూ.16,600వేతనాలు చెల్లిస్తారని పేర్కొన్నది. దీంతో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, నాన్ పీహెచ్ వర్కర్లు ఆందోళనకు గురయ్యారు. శానిటేషన్ విభాగంలో కూడా డ్రైవర్లు, సూపర్‌వైజర్లు, మంచినీటి సరఫరా విభాగంలో ఎలక్ట్రిషియన్లు, ప్లంబర్లు, ఫిట్టర్లు, టెక్నికల్, నాన్ టెక్నికల్ స్టాఫ్, కార్యాలయాల్లో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితర ఉద్యోగులు ఆందోళనకు లోనయ్యారు.

ప్రస్తుతం వీరికి రూ.19500 నుంచి రూ.23 వేల వరకు వేతనాలు చెల్లిస్తుండగా కొత్త జీవోతో రూ.16600 పొందాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిపై ఆంధ్రజ్యోతిలో మున్సిపల్ కార్మికులకు షాక్ శీర్షికన కథనం ప్రచురితమైంది. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ సైతం ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జీవో పరిణామాలపై ఆరా తీసి వెంటనే సరి దిద్దాల్సిందిగా ఆదేశించినట్టు సమాచారం. మున్సిపల్‌శాఖ దీనిపై వివరాలను తెప్పించుకున్నది. మున్సిపల్ డైరెక్టర్ కార్యాలయం ఈనెల 10న ఆర్‌ఓసీ 704292/2024/కే2 ద్వారా ప్రభుత్వానికి లేఖ రాసింది. ఈ లేఖను అనుసరించి జీవో నం.970లో సవరణలు చేస్తూ బుధవారం జీవో ఆర్‌టీ నెం.1037ను ప్రభుత్వం జారీ చేసింది. దీంతో రాష్ట్రంలోని మున్సిపల్ కార్మికులు వేతనాలు యథావిధిగా పొందనున్నారు.

నెత్తురోడిన రహదారి

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి
- కామారెడ్డి జిల్లా వాసులుగా గుర్తింపు


అబ్దుల్లా (ఫైల్)


సయ్యద్ చాంద్ (ఫైల్)

గంభీరావుపేట, జూన్ 12: రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం పెద్దమ్మ బస్ స్టేజీ సమీపంలో మూలమలుపు వద్ద బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడిక్కడే దుర్మరణం చెందారు. మృతులను కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలం మల్లుపల్లికి చెందిన షేక్ అబ్దుల్లా (32), సయ్యద్ చాంద్ (38)గా గుర్తించారు. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మల్లుపల్లికి చెందిన అబ్దుల్లా గల్ఫ్ వెళ్లేందుకు వీసా ప్రయత్నంలో ఉన్నాడు. వీసా ఇంటర్వ్యూకు వెళ్లేందుకు అదే గ్రామానికి చెందిన సయ్యద్ చాంద్‌తో కలిసి బైక్‌పై సిరిసిల్ల బయల్దేరారు. గంభీరావుపేట మండలం పెద్దమ్మ స్టేజీ దాటగానే మూలమలుపు వద్ద ఎదురుగా వచ్చిన డీసీఎం వ్యాన్ ఢీకొట్టడంతో ప్రమాదం సంభవించింది. చాంద్ వ్యాన్ ముందు టైర్ల కింద పడి మరణించగా, అబ్దుల్లా డీసీఎం వ్యాన్ బంపర్ తగిలి మృతిచెందాడు. డీసీఎం వ్యాన్ డ్రైవర్ అజాగ్రత్తగా, అతి వేగంగా నడపడంతో ప్రమాదం జరిగిందని అబ్దుల్లా భార్య జయిరాం బీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్, స్థానిక ఎస్సై రాంమోహన్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో బాలిక మృతి


అశ్విత (ఫైల్)

బీర్‌పూర్,జూన్ 12: మండల కేంద్రానికి చెందిన 9వ తరగతి చదువుతున్న అశ్విత (14) మంగళవారం రాత్రి విద్యుత్ షాక్ తగిలి మృతి చెందినట్లు ఏఎస్ఐ రవీందర్ తెలిపారు. ఏఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సముద్రాల సతీష్ సునీతల కుమార్తే అశ్విత మంగళవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో కాలకృత్యా లు తీర్చు కోవడానికి వెళ్లింది. తిరిగి వస్తుండగా బాత్ రూమ్ ఇనుప డోరుకు విద్యుత్ సరఫరా కావడంతో డోర్‌ను తీస్తున్న క్రమంలో షాక్ తగిలి అశ్విత మృతి చెందింది. అశ్విత తల్లి సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. మృతురాలు తండ్రి సతీష్ జీవనోపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడు. అశ్విత మృతిని తట్టుకోలేక స్నేహితులు కన్నీరు మున్నీరుతో విలపించారు.

రామగుండం ఎన్టీపీసీలో ప్రమాదం

వలస కార్మికుడి మృతి

జ్యోతినగర్, జూన్ 12 : రామగుండం ఎన్టీపీసీ ప్లాంటులో బుధవారం జరిగిన ప్రమాదంలో అర్జున్ మరాండి (37) అనే ఒడిశా వలస కార్మికుడు దుర్మరణం పాలయ్యాడు. ప్రాజెక్టులోని 6వ యూనిట్ యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్(ఎహెచ్‌పి)లో ఈఎస్‌పీల ఆధునికీకరణ పనులు చేస్తున్న క్రమంలో 17 మీటర్ల ఎత్తు నుంచి కింద పడడంతో ఈ ప్రమాదం జరిగింది. తలకు, శరీర భాగాలకు బలమైన గాయాలు తగలడంతో అర్జున్ అక్కడికక్కడే చనిపోయాడు. ఎత్తైన చిమ్నీపై పని చేస్తున్న సమయంలో సేఫ్టీ రోప్ పెట్టుకున్నప్పటికీ కింద పడి చనిపోయాడు. ఒడిశా రాష్ట్రానికి చెందిన అర్జున్ మరాండి ప్రభాత్ ఇంజ నీరింగ్ కంపెనీలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్నా డు. ప్రమాద సంఘటన తెలుసుకున్న ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంగాల జేఏసీ నాయకులు ఎన్టీపీసీ ఆసుపత్రికి తరలివెళ్లారు. మృతుడి కుటుంబానికి 50 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని, అంత్యక్రియలకు లక్ష రూపాయలు ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాయంత్రం వరకు కాంట్రాక్టు సంస్థ, జేఏసీ, యాజమాన్యం మధ్య జరిగిని చర్చలు జరిగాయి. అర్జున్ మరాండి కుటుంబానికి ఎన్టీపీసీ తరుపున ఇన్సురెన్సు కింద 10 లక్షల రూపాయలు, ప్రభాత్ కంపెనీ నుంచి 6 లక్షల రూపాయలు, లక్ష రూపాయలు దహన సంస్కారాలకు నెలరోజుల్లో చెల్లించేదుకు అంగీకారం కుదిరింది. అలాగే వర్క్‌మెన్ కాంపెన్‌సెషన్ స్కీం కింద మరో 15 లక్షలకు పైగా ఎక్స్‌గ్రేషియా వచ్చే అవకాశ ముంది. కాగా, సంఘటన స్థలాన్ని రామగుండం సీఐ అజయ్‌బాబు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


అర్జున్ మరాండి(ఫైల్)



అంజన్న సన్నిధిలో ఎస్పీ



కొండగట్టు అంజన్న సన్నిధిలో ఎస్పీ కుటుంబసభ్యులు

మల్యాల, జూన్ 12: కొండగట్టు ఆంజనేయస్వామిని బుధవారం ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఎస్పీకి దేవస్థానం అధికారులు స్వాగతం పలుకగా స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈవో శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మల్యాల సీఐ నీలం రవి, ఎస్సై అబ్దుల్‌రహీం ఉన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు నృత్య కళలపై ఆసక్తి చూపాలి

మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు



మెట్‌పల్లిలో నృత్య కళలపై శిక్షణ పొందిన చిన్నారులు

మెట్‌పల్లి, జూన్, 12 : విద్యార్థులు చదువుతో పాటు నృత్య కళలపై ఆసక్తి చూపాలని బీఆర్‌ఎస్ జిల్లా అధద్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. బుధవారం పట్టణంలో నృత్య శిక్షణ పొందిన విద్యార్థులకు ఆయన స్థానిక నాయకులు, నిర్వహకులతో కలిసి జ్ఞాపికలు, సర్టిఫికెట్‌లను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు శ్లోకాలు, సంస్కృతం, పద్యాలు, నృత్య కళలపై సాధన చేయడం వలన ప్రతి విషయం సులభంగా మారుతుందన్నారు. చిన్నపిల్లలకు చదువుతో పాటు సంస్కృత, సాహిత్యం, నృత్య కళలను నేర్పించడంతో ప్రతి అంశాన్ని సులభంగా నేర్చుకుంటారన్నారు. పిల్లలకు తల్లిదండ్రులు నేర్పిన మంచి అలవాటులను ఆత్మ పరిశీలన చేసుకోవడం జరుగుతుందన్నారు. పట్టణానికి చెందిన తోట శ్రీవాణి 60 మంది చిన్నారులకు నృత్య కళలపై శిక్షణ ఇవ్వడంతో అభినందించారు. కార్యక్రమంలో రమేష్, వనతడుపుల అరుణ్ కుమార్‌చారి, నరేందర్, జయమ్మ, గుర్రాల గంగాధర్, వరలక్ష్మీ, విశ్వనాథ్, స్వర్ణలతా, బాలు, భావన తిరుపతి, నాట్య గురువులు మేదిని భజంగా రావు పాల్గొన్నారు.

పరిశుభ్రమైన తాజా అహారం విక్రయించాలి

మున్సిపల్ కమిషనర్ తిరుపతి

కోరుట్ల, జూన్ 12: స్వీట్ హోంలు, బేకరీలు, హోటల్స్, ఫాస్ట్ ఫుడ్ కేంద్రాలు పరిశుభ్రమైన తాజా అహారం విక్రయించాలని మున్సిపల్ కమిషనర్ తిరుపతి సూచించారు. బుధవారం మున్సిపల్ సానిటేషన్ ఇన్‌స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్‌లు ప్రవీణ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ అకు అంజయ్యలతో కలిసి పట్టణంలో తనిఖీలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న యజమానులకు గుర్తించి జరిమానాలు విధించారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు. వినియోగిస్తే జరిమానాలతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ అంజయ్య పాల్గొన్నారు.

గోరక్ష చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని వినతి

ధర్మపురి, జూన్ 12: ధర్మపురి పరిసర ప్రాంతాల్లో అక్రమంగా జరిగే గోవధను ఆపి, గోరక్ష చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని కోరుతూ వీహెచ్‌పీ సామాజిక సమరస జిల్లా ప్రముఖ్ కస్తూరి రాజన్న ఆధ్వర్యంలో నాయకులు మండల డిప్యూటీ తహసీల్దార్ సుమన్‌కు బుధవారం వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవును కాపాడుకోవాలనే ఉద్దేశ్యంతో మన రాష్ట్ర ప్రభుత్వం 1977 సంవత్సరంలో చట్టాన్ని అమలులోకి తెచ్చిందన్నారు. రాజ్యాంగంలోని 48, 51 నిబంధనలు కూడ గోరక్ష కోసం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. దురదృష్టవశాత్తు ఈ చట్టాలను అమలు చేయవలసిన వివిధ ప్రభుత్వ శాఖల నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలని భాగ్యనగరంలో నిత్యం వేలాది గోవులు, గోసంతతిని అక్రమంగా కబేళాలకు తరలించి నిర్ధాక్షిణ్యంగా వధిస్తున్నారన్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే భవిష్యత్తులో గోసంతతి అంతరించి పోయే ప్రమాదం పొంచి ఉన్న విషయం గ్రహించాలని ఆయన తెలిపారు. వినతి పత్రాన్ని అందించిన వారిలో వీహెచ్‌పీ సామాజిక సమరస జిల్లా ప్రముఖ్ కస్తూరి రాజన్న, అల్లం దుర్గప్రసాద్, తిరుమన్‌దాసు సత్యనారాయణ, పల్లెర్ల సురేందర్,కటుకం చంద్రయ్య, అయ్యోరి మల్లేష్, బెజ్జారపు లవణ్, నారావేణి మూర్తి, గాజు భాస్కర్, ఆకుల శ్రీనివాస్, బండారి అనిల్, తోట శ్రీనివాస్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

తైబజార్ వసూలు నిలిపివేయాలి

కోరుట్ల, జూన్ 12: మార్కెట్‌లో తైబజార్‌ను ఎత్తి వేయ్యాలని నేషనల్ హకర్ ఫెడరేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో హకర్ ఫెడరేషన్ సభ్యులు మాట్లాడారు. మున్సిపల్ అధికారులు తై బజార్ టెండర్ నిర్వహిస్తూ చిరు వ్యాపారుల పొట్ట కొడుతున్నారని అరోపించారు. ఏప్రిల్ మాసంలో హైకోర్టు పిటిషన్ దాఖలు చేసినప్పటికీ కోర్టు తీర్పు రాకముందే వసూళ్లకు చేయడం బాధాకరమన్నారు. ఇకనైనా ప్రజాప్రతినిదులు అధికారులు చొరవ తీసుకొని కోర్టు తీర్పు వచ్చే వరకు తై బజారు నిర్వహణ అపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ సభ్యులు షహీద్ మోహ్మద్ షేక్, అబ్దుల్ ముసవీర్, మారు హన్మక్క, బాలక్క, అందె లక్ష్మి, మల్లవ్వ, అలువాల లక్ష్మి, గంగాధర్, ముజీబ్, సుబాష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

కోరుట్లలో చోరీ

కోరుట్ల, జూన్ 12 : పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో చోరీ జరిగింది. బస్సు ఎక్కుతున్న మహిళ హ్యాండ్ బ్యాగ్ అపహరణకు గురైనట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. మెట్‌పల్లి పట్టణంలోని గాజులపేటకు చెందిన తెడ్డు మేఘన ఇద్దరు పిల్లలతో ఆర్టీసీ బస్సులో మెట్‌పల్లి నుంచి కోరుట్ల మీదుగా కథలాపూర్‌కు వెళుతుండగా, కోరుట్ల బస్టాండ్‌లో దిగి మరో బస్సు ఎక్కుతున్న సమయంలో హ్యాండ్ బ్యాగును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు తెలిపింది. బ్యాగులో 6 తులాల వెండి, 4 తులాల బంగారు అభర ణాలున్నాయని మేఘన పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా గంగామాత ఉత్సవాలు

మెట్‌పల్లి రూరల్, జూన్, 12 : మండలంలోని చింతలపేట గ్రామంలో గంగామాత ఆలయంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బుధవారం గ్రామంలోని భక్తులు అమ్మ వారిని దర్శించుకోని ప్రత్యేక పూజలు జరిపారు. గ్రామంలోని పలువురు భక్తులు భక్తి శ్రద్ధలతో తయారు చేసిన బోనంను నెత్తిన ఎత్తుకొని డప్పు చప్పుల మధ్య ఆలయానికి చేరుకున్నారు. బోనం సమర్పించినంతరం భక్తులు బలిహారం చేసి మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మ్యాకల సుదర్శన్, విష్ణు, బుచ్చన్న, గంగారజన్, రమేష్, గణేష్, బాలు, సంజీవ్‌రెడ్డి, భక్తులు, పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల తొలగింపు

కోరుట్ల, జూన్ 12 : పట్టణంలోని 537 సర్వే నంబర్‌లో అక్రమ కట్టడాలను బుధవారం మున్సిపల్ అధికారులు తొలగించారు. సర్వే నంబర్‌లోని కాలువను అనుకోని నిర్మాణం చేసిన కాంపౌండ్‌ను మున్సిపల్ అధికారులు తొలగించారు. ఈ సందర్బంగా మున్సిపల్ కమిషనర్ తిరుపతి మాట్లాడారు. పట్టణంలో అక్రమ నిర్మాణాలు చెపడితే 2019 మున్సిపల్ చట్టం ప్రకారం తొలగిస్తామన్నారు. ప్రతి ఒక్కరు నిర్మాణాల్లో నిబంధనలు పాటించి మున్సిపల్ రూల్ ప్రకారం నిర్మాణాలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాభివృద్ధి కోసం నా వంతు కృషి చేస్తా

ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్



విద్యార్థులకు ఏక రూప దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేస్తున్న లక్ష్మణ్‌కుమార్



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ధర్మపురి, జూన్ 12: జిల్లాలో విద్యాభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఏక రూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 67,700 మంది విద్యార్థులకు దుస్తులు, పాఠ్య పుస్తకాలు అందించామన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం కోసం ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గంలో ఉన్న ప్రతి పాఠశాలలో ఎలాంటి సమస్యలు ఉన్నా వాటిని వెంటనే పరిష్కరిస్తానన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడం కోసం ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలన్నారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం అన్ని రకాల సదుపాయాలు కల్పించి చక్కని విద్యా బోధన చేస్తుందన్నారు. డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఉగాది తొలి పండుగగా భావిస్తున్న తరుణంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా జూన్ 12 విద్యార్థులకు ఒక పండుగలా ఉందన్నారు. విద్యాభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ తరగతి గదుల్లో విద్యార్థుల హాజరు శాతం అధికంగా ఉంటే తన వంతుగా రూ 10 వేలు ఖర్చు చేసి బహుమతులు అందిస్తానన్నారు. విద్యార్థులు కష్టించి చదివి ఉన్నత ఫలితాలు సాధించి పాఠశాలలకు మంచి గుర్తింపు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, ఎంపీపీ ఎడ్ల చిట్టిబాబు, జడ్పీటీసీ బత్తిని అరుణ, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఇందారపు రామయ్య, నోడల్ అధికారి లక్ష్మీనారాయణ, తహసీల్దార్ కృష్ణచైతన్య, ఎంపీడీవో రవీందర్, ఎంపీవో నరేష్‌కుమార్, మున్సిపల్ మేనేజర్ గంగాధర్, ఐకేపీ ఏపీఎం రమాదేవి, హెచ్‌ఎం శ్రీనివాస్, దహెగాం గణేష్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ కొండవేని మమత, చైతన్య మండల సమాఖ్య అధ్యక్షురాలు సరిత, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల కౌన్సిలర్లు వేముల నాగలక్ష్మి, జక్కు పద్మ, గరిగె అరుణ పాల్గొన్నారు.

సారంగాపూర్ : ప్రభుత్వ బడుల్లో అత్యుత్తమ నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తారని ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థుల భవిష్యత్తు ఉన్నతమైన స్థానంలో ఉంటుందని కలెక్టరు షేక్ యాష్మిన్ బాష అన్నారు. బుధవారం మండలంలోని పెంబట్ల కోనాపూర్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ప్రొఫెసర్ బడిబాట కార్యక్రమంలో బాగంగా ఉచిత ఏకరూప దుస్తులు, పుస్తాకాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టరు సంజయ్ కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. కలెక్టరు మాట్లాడుతూ రానున్న రోజుల్లో ప్రభుత్వ బడులదే పైచేయి ఉంటుందని విద్యార్థులు ప్రవేశాల కోసం క్యూలైన్‌లో నిలబడే రోజులు వస్తాయని ఆశబావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే డాక్టరు సంజయ్ కుమార్ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ప్రభుత్వ బడులను బలోపేతం చేయలని తద్వారా పేద విద్యార్థులకు ఉపయోగం ఉంటుందన్నారు. మన ఊరు మనబడి కార్యక్రమంలో కోనాపూర్ పాఠశాలలో కోటి 50 లక్షలతో పనులు పూర్తి చేయడం జరిగిందని వాటి బిల్లులు విడుదల చేసేల ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి కృషి చే యాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కోరినట్లు తెలిపారు. అనంతరం జిల్లాలోనే 10 జీపీఏ సాధించిన అక్షర అనే విద్యార్థినిని కలెక్టరు, ఎమ్మెల్యే శాలువతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మదుసుదన్, పీడీ, ఏపీడీ, ఎంపీపీ కోల జమున, జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, కేడీసీసీ జిల్లా మెంబరు సీనియర్ నాయకులు రాంచందర్‌రావు, ఎంపీటీసీ సుధాకర్‌రావు, తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో లచ్చాలు, ఎంఈవో భీమయ్య పాల్గొన్నారు.

పెగడపల్లి : రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రత్యేక శ్రద్ద కనబ రుస్తుందని ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా పెగడపల్లి మండల కేం ద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బుధవారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషాతో కలసి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కాసుగంటి రాజేందర్ రావు, ఎంపీపీ గోళి శోభ, డీపీవో దేవరాజం, ఆర్డీవో మదుసూదన్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో శ్రీనివాస్, వివిద పాఠశాలల ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



నోట్ పుస్తకాలు అందిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

కథలాపూర్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అంబారిపేట పాఠశాలలో ప్రొఫెసర్ జయ శంకర్ బడిబాటలో భాగంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు, యూనిఫాం పంపిణీ చేసిన అనంతరం మాట్లాడారు. ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా సర్కారు పాఠశాలలను పటిష్టం చేస్తోందని అన్నారు. ఎంఈవో ఆనందరావు, ఎంపీపీ జవ్వాజి రేవతి, ఎంపీటీసీ వేముల గంగరాజం, ఎంపీవో ప్రవీణ్, ఏపీఎం నరహరి, హెచ్‌ఎం కిషన్‌రావు, ఉపాధ్యా యులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

జగిత్యాలరూరల్ : జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస గ్రామంలో బుధవారం అంగన్‌వాడీ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ తీసి ప్రీ స్కూల్ విద్య గురించి వివరించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో ఆటపాటలతో విద్యబోధన నిర్వహిస్తామన్నారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మమత, ఉషా, ప్రభ, శారధ, గంగాలక్ష్మీ పాల్గొన్నారు.

భీమారం: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ వొద్దినేని హరిచరణ్ రావు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలి

జగిత్యాల అర్బన్ ఎంపీపీ ములాసపు లక్ష్మి



అర్బన్ మండలసర్వసభ్యసమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

జగిత్యాలరూరల్, జూన్ 12 : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యే యంగా అధికారులు పనిచేయాలని జగిత్యాల అర్బన్ ఎంపీపీ ములాస పు లక్ష్మీ అన్నారు. బుధవారం జగిత్యాల అర్బన్ మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం బు. దవారం ఎంపీపీ లక్ష్మీ అధ్యక్షతన అర్బన్ మండల సమావేశమందిరంలో నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా 20 అంశాలపై చర్చసాగింది. సభ్యులు తమ సమస్యలను మండల స మావేశంలో గళమెత్తారు. ఈసందర్భంగా ఎంపీపీ ములాసపు లక్ష్మీ మాట్లాడుతూ జగిత్యాల మండలం తిప్పన్నపేట గ్రామంలో గల శ్మశాన వాటిక వద్ద కనీసమౌలిక వసతులు లేవని, నీటి వసతి లేకపోవడంతో ధర్మపురి గోదావరికి వెళ్లి ప్రజలు స్నానాలు చేసే దుస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే శ్మశానవాటిక వద్ద మౌలిక వసతులు క ల్పించాలని ఏఈ రాజమల్లయ్యను ఆదేశించారు. తిప్పన్నపేట బీసీకాల నీలో డ్రైనేజీ కూలి పోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని, డ్రైనేజీ కూలిపోవడంతో ప్రజలు అందులోపడి గాయాలపాలవుతు న్నారని వెంటనే డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. తిప్పన్నపేట ఐకేపీ సెంటర్ భూమి కబ్జాకు గురవుతుందని వెంటనే కాంపౌండ్‌వాల్ నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జగిత్యాల మండలం ధరూర్ నుంచి జగిత్యాల వయా గొల్లపల్లి రహదారికి నిధులు మంజూరైనా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో రహదారి నిర్మాణం చేపట్టడం లేదని, నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్ అగ్రిమెంట్ రద్దు చేయాలని మోతె ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మోతె పీహెచ్‌సీలో సిబ్బంది లేకపోవడంతో కల్లెడ వెళ్లి ప్రజలు రక్తపరీక్షలు చేసుకుంటున్నారని మోతె ఎంపీటీసీ రాజశేఖర్ రెడ్డి సభలో తమ సమస్యలను సభ దృష్టికి తీసుకువ చ్చారు. ఉపాధిహామీ ద్వారా కూలీలకు పనులు కల్పించాలని ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. జగిత్యాల మండల ప్రత్యేకాధికారి రాజ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో అధికారులు నిరం తర పర్యవేక్షణ చేపట్టి సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జడ్పీటీసీ మహేష్ మాట్లాడుతూ అభివృద్దే ధ్యేయంగా అధికారులు పనిచేయాలన్నారు. ఎంపీడీవో విజయలక్ష్మీ మాట్లాడుతూ సభ్యులు లేవనెత్తిన సమస్యలను సంబంధిత అధికారులు నోట్ చేసుకొని సమస్య పరిష్కా రానికి కృషి చేయాలని సూచించారు. అమ్మ ఆదర్శపాఠశాలల ద్వారా పాఠశాల లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ మహేష్, ఎంపీడీవో విజయలక్ష్మీ, ఏఈ సుందర్, ఎంపీవో సలీం, అర్బన్ డీటీ తిరుపతి, ఏవో వినీల, ఏపీఎం గంగాధర్, టీఏ దయాకర్, జూనియర్ అసి స్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, మండల సభ్యులు, పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

కొడిమ్యాల, జూన్ 12 : మండల కేంద్రంలోని పడమటి వాడ రెడ్డి సంఘం మహిళలు బుధవారం పోచమ్మ బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. రెడ్డి సంఘం మహిళలు ఇంటికొక్క బోనం నెత్తిన పెట్టుకొని ఆలయానికి డప్పు చప్పుళ్ళతో, యువకులు నృత్యం చేస్తు వెల్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి పిల్లా పాపలను చల్లంగా చూడాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు, సభ్యులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

మల్లాపూర్, జూన్, 12 : విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదువాలని ప్రధానోపాధ్యాయుడు సూచించారు. బుధవారం మండలంలోని కుస్థాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేశారు.

అనంతరం విద్యార్థులకు చదువు నేర్చు కోవడం, చదవడంలో పలు సూచనలు చేశారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులకు, గ్రామానికి పేరు తీసుకొచ్చే విధంగా క్రమశిక్షణంతో విద్య అభ్యసించాలన్నారు.

'కాలం చెల్లిన వస్తువులు అమ్మితే చర్యలు తప్పవు'



మెట్‌పల్లి కిరణం షాపు యజమానిని నిలదీస్తున్న అధికారి

మెట్‌పల్లి, జూన్, 12: ఇష్టానుసారంగా కాలం చెల్లిన నిత్యవసర సరుకులు, నాణ్యత ప్రమాణాలను పాటించకుండా తినే పదార్థాల విక్రయాలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ శాఖ జిల్లా అధికారి అనూష హెచ్చరించారు. పట్టణంలో కాలం చెల్లిన నిత్యవసర సరుకులను విక్రయాలు జరుపుతున్నరని, గోల్డెన్ బేకరీలో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా పదార్థాలు విక్రయిస్తున్నరని పిర్యాదు మేరకు బుధవారం తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలోని శివ సాయి కిరాణంలో నిత్యవ సర సరుకులు, గోల్డెన్ బేకరీలో కాలం చెల్లిన చిప్స్, బ్రెడ్ ప్యాకెట్స్‌తో పాటు పలు రకాల పదార్థాలను గుర్తించారు. శివ సాయి కిరణంలో కాలం చెల్లిన వ స్తువులు ఎక్కువ లభించడంతో పాటు పెండింగ్ బిల్లు చెల్లించక పోవడంతో షాపును సీజ్ చేశారు. కాలం చెల్లిన వస్తువులు, నాణ్యత లేని తినుబం డరాలను ఏలా విక్రయిస్తారని నిర్వాహకులను నిలదీసి కిరణం షాపును సీజ్ చేసి, బేకరీపై కేసు నమోదు చేశారు. ధరలు పెరగడంతో నాణ్యత ప్రమాణాల పాటించకుండా డేట్ ఎక్స్‌పైర్ అయిన వాటిని విక్రయాలు, టెంపరేచర్ ప్రమాణాలు పాటించకుం డా, శుభ్రత పాటించకుండా విక్రయిస్తున్నారన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

కోరుట్ల, జూన్ 12 : మండలంలోని పైడిమడుగు గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో 2001 - 2002 సంవత్సరం 10వ తరగతి చదివి విద్యార్థులు బుధవారం అపూర్వ సమ్మేళనంగా ఏర్పడ్డారు. గ్రామంలోని శుక్రవారం అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించిన పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనంగా ఏర్పడి పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. తమకు విద్యాబో ధన చేసిన గురువులను సన్మానం చేసి గురుపూజలను చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తాము చేస్తున్న ఉద్యోగాలు వ్యాపారాలు వివరాలను సేకరించి పాఠశాల అభివృద్ధి చేయాల్సిన కార్యక్రమాలను చర్చించారు. . చదువుకొని మృతి చెందిన స్నేహితులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల మధ్య నాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. అనంతరం ఒక్క చోటు చేరుకోని సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో వెల్లుల్ల తాజా మాజీ సర్పంచ్ గురుడూ రజిని, నిర్వహకులు, అంకం శంకర్, విక్రమ్, ఇట్టేడి మహేష్, నాయిని శ్రావణ్, జిన్న చందు, సంజీవ్‌రాజ్, మర్రిపెల్లి స్వప్న, రొడ్డవేని మంజుల, గుజ్జేటి మాధవి, పూర్వ విద్యార్థులు, కుటుంబ సభ్యులు, పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్ : విద్యార్థి జీవితం తిరిగినరానటువంటి పూర్వ విద్యార్థులు దాదాపు 24 ఏళ్లకు కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధుల్వేకుండా పోయాయి. మండలంలోని బండలింగాపూర్ గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 2000-01వ బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. 24 సంవత్సరాల తర్వాత ఏర్పాటు చేసుకున్న కార్యక్రమానికి ఇతర ప్రాంతాలో స్థిరపడిన విద్యార్థులు తరలివచ్చారు. తమతో





అపూర్వ సమ్మేళనంలో పాల్గొన్న పైడిమడుగు, బండలింగాపూర్ పూర్వ విద్యార్థులు

సంక్షిప్త సమాచారం

జగిత్యాల అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల (బాలికల)లో కూల్చివేసిన తరగతి గదుల నిర్మాణం పూర్తయ్యేలా తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ జీ వన్‌రెడ్డి హామీ ఇచ్చారు. జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియం సమీపంలో గల పాఠశాలను పరిశీలించి కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఏఈకి ఫోన్ చేసి పరిస్థితిని అడిగి తెలుసు కున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దసరా వరకల్లా పూర్తిస్థాయిలో తరగతుల నిర్మాణం పూర్తి చేస్తానని, పాఠశాల వాతావరణం మార్చేలా తనవంతు కృషి చేసేందుకు పాఠశాలను దత్తత తీసుకుంటామన్నా రు.

రాయికల్: మండలంలోని కిష్టంపేట గ్రా మంలో శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి 10వ వార్షికో త్సవాల్లో భాగంగా బుధవారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలు ఎత్తుకుని డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవే ద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, జగిత్యాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ బోగ శ్రావణి, బీజేపీ రాయికల్ మండల అధ్యక్షుడు అన్నవేణి వేణు, పాల్గొన్నారు.

●మండలంలోని ఉప్పుమడుగు కస్తూర్బా గాంధీ పాఠశాలలో అమ్మ ఆదర్శ పథకం కింద మంజూరైన పనులను తహసీల్దార్ ఖయ్యూం బుధవారం పరిశీలించారు. పనులను నాణ్యతతో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రావు, ప్రత్యేకాధికారి శోభారాణి పాల్గొన్నారు.

●కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలపై దృష్టి పెట్టాలని బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి తిరుపతి గౌడ్ అన్నారు. బడుగు, బలహీన వర్గాలకు గత ప్రభుత్వం అందించిన కల్యాణ లక్ష్మి, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం అయితే అందించే కేసీఆర్ కిట్, న్యూట్రీషన్ కిట్ల పంపిణీ నిలిపివేశారన్నారు. తక్షణమే ఈ పథకాలను పునరు ద్ధరించాలని, లేనిచో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా పోరాటం చేస్తామన్నారు.

మల్లాపూర్ : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేయడంతో మల్లాపూర్ మండలానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి మోతుకూరి రాజేందర్‌గౌ డ్ రక్తదానం చేసి మొక్కు చెల్లించుకున్నారు. బుధవారం మెట్‌పల్లిలోని బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేసి అభిమానాన్ని చాటుకున్నారు.

కొడిమ్యాల : మండలంలోని హిమ్మతురావుపేట, డబ్బుతిమ్మయ్యపల్లి గ్రామాల్లో కొత్త పాఠశాలలు ఏర్పాటు చేయాలని కొడిమ్యాల జడ్పీటీసీ పునుగోటి ప్రశాంతి కలెక్టర్, డీఈవోకు వినతి పత్రం అందించినట్లు బుధవారం తెలిపారు. హిమ్మతురావుపేట గ్రామ పంచా యతీగా ఏర్పడి ఐదేళ్ల గడిచిందన్నారు. గతంలో డబ్బు తిమ్మయ్యపల్లి గ్రామ పంచాయతీలో ఉన్న పాఠశాలను రాంసాగర్ పాఠశాలలో విలీనం చేశారన్నారు. ముఖ్యమంత్రి ప్రతి గ్రామ పంచా యతీలో పాఠశాల ఉండాలని సూచించి నందున హిమ్మతురావుపేట, డబ్బుతిమ్మయ్యపల్లి గ్రామ పంచాయతీలలో పాఠశాలలను ఏర్పాటు చేయాలన్నారు.

ధర్మపురి: ధర్మపురి పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం శాంతి సమావేశం నిర్వహించారు. బక్రీద్ పండుగ పురస్కరించుకుని ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సీఐ రాంనర్సింహారెడ్డి మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగ జరుపుకోవాలని అన్నారు. ఎస్ఐ ఉదయ్‌కుమార్, మత పెద్దలు పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్ : జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి ఆదర్శపాఠశాలలో సాంఘికశాస్త్ర విభాగంలో గంటల ప్రాదికన బోదించుటకు ఉపాధ్యాయ ఉద్యోగం కోసం ధరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కండ్లపల్లి ఆదర్శపాఠశాల ప్రిన్సిపల్ నాగసుధారాణి తెలిపారు. ఉద్యోగం కోసం ధరఖాస్తు చేసుకునే అభ్యర్థులు బీఇడీ, టెట్ లో ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 18 లోపు దరఖాస్తు పారంతోపాటు విద్యార్హత పత్రాలను పాఠశాల లో సమర్పించాలని కోరారు.

రాయికల్: యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపూర్‌కు చెందిన లింగస్వామి అనే ఫొటోగ్రాఫర్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ రాయికల్ పట్టణంలో రాయికల్ మండల విఘ్నేశ్వర ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన చేపట్టారు. పుట్టపాక గ్రామంలో ఓ కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్ మొబైల్ ఫోన్‌లో ఫోటోలు తీయలేదని లింగస్వామిపై దాడి చేశారు. దీనికి నిరసనగా రాయికల్ బస్టాండ్ నుంచి గాంధీ బొమ్మ, శివాజీ బొమ్మ మీదుగా ర్యాలీ నిర్వహించారు.